క్లుప్తంగా

నేడు జగన్నాథస్వామికి చందనోత్సవం



జగన్నాథస్వామి ఉత్సవమూర్తులు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం చందనోత్సవం, అభిషేకాలు నిర్వహిస్తామని అర్చకులు గోపాలకృష్ణమాచార్యులు, పద్మకుమార్ ఆచార్యులు మంగళవారం తెలిపారు. ఏటా పూరీ శ్రీక్షేత్రంలో నిర్వహించే విధంగా జ్యేష్ఠ పౌర్ణమినాడు చందనోత్సవ జరిపిస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేసినట్టు ఆలయ మేనేజర్ బి.రాంబాబు తెలిపారు.

పోలీసుల తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్సై రవివర్మ

కవిటి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కవిటిలో ఎస్సై వి.రవివర్మ ఆధ్వర్యంలో మంగళవారం నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు. కవిటి మండల కేంద్రంలో వివిధ ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లో తనిఖీలు చేశారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



ఆలయ కమిటీ సమావేశంలో శ్రీధర్ తదితరులు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతోందని పలాస పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ అన్నారు. మాకన్నపల్లి గ్రామంలో నిర్మిస్తున్న మహేశ్వరాలయ నిర్మాణ పనులను మంగళవారం సందర్శించారు. అండమాన్, బిలాయి వంటి ప్రాంతాల నుంచి విచ్చేసిన ఉద్దాన ప్రాంతీయులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. 2026 మే నెలలో ఆలయాన్ని ప్రారంభిస్తామన్నారు. మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య, గ్రామపెద్దలు కుత్తుం ధర్మారావు, బత్తిని వీరాస్వామి, భీమారావు ఉన్నారు.

బొడ్డపాడులో యోగాంధ్ర ర్యాలీ



ర్యాలీ చేస్తున్న దృశ్యం

పలాస: బొడ్డపాడు గ్రామంలో మంగళవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మండల అధికారులు ఆదేశాల మేరకు గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ మహిళలు, తెలుగు యువత కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ నెల 21న జరుగనున్న యోగా డేను విజయవంతం చేయాలని కోరారు.


చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, సంఘ సభ్యులు

టెక్కలి: టెక్కలి కొండ్రవీధికి చెందిన నెల్లూరు శ్రీకాంత్, శృతీ దంపతుల ఆరు నెలల చిన్నారికి ప్రాణాంతకమైన వ్యాధి వచ్చింది. అయితే వైద్యం చేయించుకునేంత ఆర్థికస్థోమత ఆ దంపతులకు లేదు. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, బాలాజీ హనుమాన్ సంఘం సభ్యులు రూ.93,500 సేకరించారు. ఈ మొత్తాన్ని చిన్నారి తల్లిదండ్రులకు మంగళవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి పూజలు



ముర్రాటలతో ఊరేగుతున్న భక్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: చినవంక గ్రామంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో గ్రామ పెద్దమ్మ తల్లికి చల్లదన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పెద్ద ఎత్తున మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

మురికి కూపంగా బాలకృష్ణాపురం!





బాలకృష్ణాపురం వీధుల్లో పొంగిపొర్లుతున్న మురుగునీరు

- క్షీణించిన పారిశుద్ధ్యం
- దోమలు స్వైర విహారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలు అంటారు. పల్లెలు బాగుంటే మనుషులకు రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గ్రామాల శుభ్రతపై దృష్టిసారించే నాథుడేలేకుండా పోయాడు. దీంతో చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించి వ్యాధులు ప్రబలే అవకాశం నెలకుంది. దీనికి ఇచ్ఛాపురం మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పారిశుద్ధ్యం క్షీణించింది. కాలువల్లో ప్రవహించాల్సిన మురుగునీరు వీధుల్లో పొంగి పొర్లుతోంది. ఫలితంగా దోమలు విజృంభించి జనానికి కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. కాలువల్లో పూడిక తీయక పోవడంతో చెత్తా, చెదారం తాండవిస్తోంది. దోమల నివారణకు పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలేమీ లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక షాడో సర్పంచ్ వేధింపులు భరించలేక ఏడాదిలో నలుగురైదుగురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు చేపట్టిన నెల, రెండు నెలల్లోనే విధుల నుంచి తప్పుకుంటున్నారు. పంచాయతీలను పర్యవేక్షించాల్సిన పంచాయతీ విస్తీరణ అధికారి, ఎంపీడీవోలు కార్యాలయానికే మాత్రమే పరిమితమైపోతున్నారని, కనీసం తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇళ్ల ముంగిళ్లలో నీరు నిల్వ అవుతుండటంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండ దోమలు స్వైర విహారం చేస్తున్నాయని చెబుతున్నారు. పిల్లా పాపలతో నివసిస్తున్న తమకు దుర్వాసనతో ఎక్కడ అంటువ్యాధులు సోకుతాయోనని హడలిపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి బాలకృష్ణపురం గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ముందస్తుగా బ్లీచింగ్ పౌడర్ వంటివి పిచికారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పెద్దవీధి కాలువలో పేరుకుపోయిన చెత్తా,చెదారం

నరకయాతన పడుతున్నాం..



మా గ్రామంలో కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో పగలు మురుగుకంపు, రాత్రి దోమల బాధతో నిత్యం నరకయాతన పడుతున్నాం. పలుమార్లు సచివాలయ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కనీసం కాలువల్లో పూడిక కూడా తీయడం లేదు.

– బి.శ్యామ్‌బాబు, యువకుడు, బాలకృష్ణాపురం

ముగిసిన పెంటపోలమ్మ ఉత్సవాలు



కాంతార వేషధారణలో కళాకారుడు



పూజలందుకున్న పెంటపోలమ్మ



ఘటాల ఊరేగింపులో పల్లివీధి మహిళలు

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని పెంటపోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. ఈ నెల ఆరో తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఐదురోజులపాటు వైభవంగా జరిగాయి. చివరి రోజున పెంటవీధి, డెంకివీధి, పొందరవీధి, బ్రాహ్మణవీధులలో ఘటాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు వేసిన వేషధారణలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి

పెంటపోలమ్మ ఉత్సవాల్లో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం పాల్గొన్నారు. బ్రాహ్మణవీధిలో ఏర్పాటు చేసిన పెంటపోలమ్మ సెట్‌ను సందర్శించారు. మున్సిపల్ విప్ శంకర్‌పండా, కోఆప్షన్ సభ్యులు గౌరీసుజాత త్యాడీ, నాయకులు శిష్టు గోపి, అంబటి ఆనందరావు, మార్పు యుగంధర్ ఉన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

పేరుకే రిపేర్..అంతా తారుమార్!



ఇచ్ఛాపురం రూరల్: ప్యాచ్‌వర్క్ చేసిన ప్రాంతంలో చెరువును తలపిస్తున్న మండపల్లి రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: శిథిలావస్థకు చేరుకున్న రోడ్లను మరమ్మతులు చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజా ప్రతినిధుల అలసత్వంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో గోతులు కప్పాల్సిన చోట విడిచి పెట్టి, వారికి ఇష్టమైన ప్రదేశాల్లో మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఎం.తోటూరు నుంచి మండపల్లి గ్రామానికి వెళ్లే తారు రోడ్డు మరమ్మతుల పేరిట ఈ ఏడాది మార్చి నెలలో సుమారు రూ.8 లక్షల వ్యయంతో ప్యాచ్‌వర్క్ చేశారు. అయితే గ్రామ సచివాలయం పరిసర ప్రాంతంలోని గోతుల్లో ప్యాచ్‌వర్క్ నామమాత్రంగా చేయడంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో బాటసారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

చెరువుగా మారింది..



టెక్కలి: షిర్డీసాయి మందిరానికి ఎదురుగా చేరిన వర్షం నీరు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి శంభాన వీధిలో షిర్డీసాయి మందిరానికి ఎదురుగా చెరువుగా మారింది. మంగళవారం వేకువ జామున కురిసిన చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం చెరువును తలపించింది. ఒక వైపు గ్రంథాలయం, మరో వైపు ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు, మందిరానికి వెళ్లే వారంతా అనేక ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి దాపురిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డెక్కిన మురుగు



కాశీబుగ్గ: రోడ్డుపైకి చేరిన మురుగునీరు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తిలక్‌నగర్ గణపతి రెసిడెన్సీ పక్కన ఉన్న సీసీ రోడ్డుపైకి మురుగునీరు వచ్చి చేరుతుంది. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగునీరు పారే అవకాశం లేక రోడ్డుపైకి చేరుతుండడంతో ఇబ్బంది నెలకుంది. మురుగునీటి కారణంగా దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఉన్న విద్యా సంస్థలకు, ఆస్పత్రికి రాకపోకలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏడు, తొమిది తరగతుల్లో చేరేందుకు మిగిలిన సీట్లు భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఏడో తరగతికి సంబంధించి బీసీడీ జనరల్–1, తొమ్మిదో తరగతికి సంబంధించి బీసీబీ జనరల్–1, ఎస్టీ జనరల్–1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్నవారు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీ గ్రూపులో సీట్లు మిగిలి ఉన్నాయని ఆసక్తి ఉన్నవారు తమను సంప్రదించాలన్నారు.

ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి..

ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హుల జాబితాను నోటీసుబోర్డులో ఉంచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా చేరనివారి సీట్లను వేరేవారికి కేటాయిస్తామన్నారు. సీట్లు వచ్చినవారు గడువులోగా చేరాలని సూచించారు.

☛ కంచిలి: మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్. శివప్రసాద్ తెలిపారు. ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీలో కూడా సీట్లు ఉన్నాయని..ఆసక్తి ఉన్న ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని.. ప్రింట్‌ను స్కూల్‌కు సమర్పించాలని సూచించారు.

లోఓల్టేజీతో తీవ్ర సమస్యలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతవాసులను విద్యుత్ లోఓల్టేజీ సమస్య వెంటాడుతోంది. నేతాజీనగర్, సూదికొండ, ఐటీఐ కళాశాల, సూదికొండ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రాంతంలో ప్రజలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద విత్తనాల పంపిణీ ప్రక్రియన మంగళవారం నుంచి ప్రారంభమైనట్టు వ్యవసాయ సహాకులు మల్లేశ్వరరావు తెలిపారు. తొమ్మిది రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సినవారు రైతు సేవాకేంద్రంలో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నీటిసంఘం అధ్యక్షుడు కె.ధనుంజయ్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తీరంలో ఇసుక అక్రమ రవాణా

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామంలో సముద్ర తీరాన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఇసుకను ట్రాక్టర్లలో నింపి బయటకు రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

వేడుకగా చింతామణి అమ్మవారి సంబరం

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామంలో మంగళవారం చింతామణి అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరంలో కాళీమాత వేషధారణ, సన్నాయి మేళం నడుమ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా పండిత సత్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా మంగళవారం పండిత సత్కారాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామికి మంగళాశాసనాలు, పండితుల వేద పఠనం, చతుర్వేద పారాయణం జరిగింది. అనంతరం వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో వేమూరి ప్రభాకరశర్మ, తెన్నేటి వెంకన్నశర్మ, దర్భముళ్ల ఆదిత్య శర్మ, పెంటా శ్రీనివాసశర్మ, తుమరాడ సందీప్ శర్మ, ధర్మపురి కృష్ణమూర్తి శర్మ, పెంట కిరణ్‌కుమార్ శర్మ, పెంట రాజగోపాల్ శర్మ, ఈదరపు ప్రశాంత్‌శర్మలకు పండిత సత్కారం, మహదాశీర్వచనం నిర్వహించారు. 11న నాగావళి నదిలో స్వామివారికి త్రిశూల స్నాన మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గన్నవరపు కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, ఆలయ ఈఓ మునగవలస సుకన్య, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ



ఇచ్ఛాపురం మండలం అరకబద్ర రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ఎంపీపీ బోర పుష్ప రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రాయితీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు. వారం రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయని, ముందస్తుగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ అధికారులపై ఉందన్నారు. శాసనాం సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, టీడీపీ నాయకుడు పెదిన బాబ్జీ, ఏఈవో జి.దీక్షిత్, రైతులు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

అమ్మవారికి చల్లదనం



కవిటి మండలం ఆర్.భైరిపురం గ్రామదేవత అఖిలాండేశ్వరి అమ్మవారికి చల్లదనం ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఏటా జేష్టమాసంలో అమ్మ వారికి ఊరంతా చల్లదనం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. పాడిపంటలతో రైతులు తులతూగాలని, వర్షాలు సకాలంలో కురిసి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కాళీమాత వేషధారణలతో ఊరేగించి గ్రామశివార్లలోని తోటల్లో అమ్మవారి ఆలయంలో పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. – కవిటి

ఆర్థికాభివృద్ధికి సహకారం



మహిళా సంఘాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోందని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస మండల మహిళ సమాఖ్య పాలక వర్గ సమావేశం మంగళవారం జరిగింది. మహిళ సంఘాలలో సభ్యులు వ్యక్తిగతంగా ఏదైనా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్పత్తికి సంబంధించి కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుంటే ఉమెన్ లెడ్ యాక్టివిటీ పేరుతో వ్యక్తిగతంగా రుణం సాయం చేయాలని ప్రభుత్వం బ్యాంకులను ఆదేశించినట్లు వివరించారు. మండల సమాఖ్య ప్రతినిధులు సవర కాంతమ్మ, మెట్ట శారద, కళ్యాణి, కృష్ణకుమారి, రాజారావు, తారక మోహన్, స్వామి నాయుడు, బాలకృష్ణ ఉన్నారు. – మందస

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

టెక్కలి: రాష్ట్రంలో తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ మంగళవారం టెక్కలిలో పలు ప్రభుత్వ కార్యాలయంలో అవగాహన కార్యక్రమంతో పాటు పోస్టర్ ఆవిష్కరణలు చేశారు. జిల్లాలో సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. డీఏ బకాయిలపై న్యాయ పోరాటం చేస్తున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

సెప్టెంబర్ ఒకటో తేదీన పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సీపీఎస్ రద్దు కోసం ఉధృతమైన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వి.శరత్‌బాబు, యాళ్ల శ్యామ్, సుందర్ రావు, బి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కంచమ్మతల్లి ఉత్సవాలు



అమ్మవారి ఊరేగింపులో భక్తులు



కంచమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు



దీపారాధన చేస్తున్న జిల్లా జడ్జి కిశోర్‌బాబు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ దంపతులు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న కళింగ వైశ్య సంఘం సభ్యులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన కంచమ్మతల్లి గ్రామదేవత సంబర మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారి సంబరాలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు హాజరై పీఠస్థానంలో అమ్మవారును, నమూనా ఆలయంలో అలంకరించిన అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్. కిశోర్‌బాబు దంపతులు, జూనియర్ జడ్జి శ్రీనివాస్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. సోంపేట, ఇచ్ఛాపురం సీఐలు బి.మంగరాజు, చిన్నంనాయుడు, కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని పీఠస్థానం నుంచి జాతీయ రహదారి కూడలి కేశవరావు దాబా వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి మెయిన్‌రోడ్డులో మఠం కంచిలి వరకు ఊరేగింపు చేపట్టారు. అమ్మవారితోపాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అమ్మవారి సంబరాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు రూ. 75 వేలు విరాళాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు. ఊరేగింపుకు వచ్చిన భక్తులకు కంచిలి కళింగ వైశ్య సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, రిటైర్డు టీచర్ సాహుకారి సోమేశ్వరరావు కుటుంబం ప్రసాదాలు పంపిణీ చేశారు.